క్లుప్తంగా

రేపు రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం

మండపేట: మండపేట రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం శనివారం జరుగుతుందని సంఘ కార్యదర్శి పెంకే గోవిందరావు తెలిపారు. స్థానిక రామహిందు మున్సిపల్ స్కూల్‌లో సంఘాధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశంలో డీఆర్ వివరాలు, ఇన్‌కం టాక్స్, ఈకేవైసీ, లైఫ్ సర్టిఫికెట్ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. సభ్యులందరూ హాజరు కావాలని గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు.

పంట పొలాలపై పందుల దాడి



గొల్లపాలెంలోని పంట పొలంలో సంచరిస్తున్న పందులు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో పందులు స్వైరవిహారం చేస్తూ పంట పొలాలపై దాడి చేస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలం మధ్యలోకి వెళ్లి వరి మొక్కలను తొక్కి చిందర వందర చేస్తుండడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని అన్నదాతలు చెబుతున్నారు. వీటిని అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



హెచ్‌ఎం రాజును సన్మానిస్తున్న సర్పంచ్ రమణ, ఎంపీటీసీ లక్ష్మణ్ తదితరులు

కె.గంగవరం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న దంగేరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నేతునూరి రాజును సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, గ్రామ పెద్దలు శాలువ, పూలదండలతో సత్కరించారు. ఇదే స్ఫూర్తితో పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గెద్దాడ శ్రీరామ్, మోర్త దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా భాగస్వామ్య దినోత్సవం



నరసాపురపుపేటలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు హెచ్‌ఎం కేకేఎల్ కుమారి ఆధ్వర్యంలో స్వచ్ఛతా భాగస్వామ్య దినోత్సవం నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛ భారత్ అంశాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల పీడీ ఎం.స్వాతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిండు శోకంతో అర్బయీన్



ద్రాక్షారామలో గుమ్మటాన్ని ఊరేగిస్తున్న ముస్లిం భక్తులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో అర్బయీన్ 40వ రోజు సంతాప దినాలు గురువారంతో ముగిశాయి. నిండు శోకంతో ముస్లిం భక్తులు, అంజుమన్ సంఘాలు, పంజా ధర్మకర్తలు కర్బలా అమర వీరుల వర్ధంతిని జరుపుకున్నారు. ఇస్లాం పరిరక్షణ కోసం మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమాంహుస్సేన్ పడిన కష్టాలను గుర్తు చేసుకుంటూ విలపించారు. మౌలా అఘూర్ ఖానా నుంచి గుమ్మటం ఊరేగింపు నిర్వహించారు. మత గురువులు మౌలానా అస్కరి హుస్సేన్, ఆబెద్ అలీజుమ్మి మజ్లిస్‌లు వివరించారు. ద్రాక్షారామతో పాటు పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ముస్లిం భక్తులు పాల్గొన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం కార్యక్రమం

రామచంద్రపురం రూరల్: మండల స్థాయిలో నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొంచి ఉన్న పెనుముప్పు

- మార్కెట్లో ఇబ్బడిముబ్బడిగా నకిలీ చిరుతిళ్లు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



మార్కెట్‌లో అమ్ముడుపోతున్న నకిలీ స్నాక్స్ ప్యాకెట్లు

కాజులూరు: మార్కెట్‌లో ఇబ్బడిముబ్బడిగా నకిలీ చిరుతిళ్లు దర్శనమిస్తున్నాయి. పేరున్న బ్రాండ్లకు కొద్దిపాటి మార్పులతో నకిలీ బ్రాండ్ల స్నాక్స్ రంగురంగుల ప్యాకింగ్‌లతో కిల్లీ షాపులు, కిరాణా దుకాణాలు, బేకరీల వద్ద దర్శనమిస్తున్నాయి. వీటి అమ్మకాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నాణ్యత లేని ఆహార పదార్థాలు ప్రజల వద్దకు చేరుతున్నాయి. ప్రధానంగా కార్టూన్లతో ఆకర్షణీయంగా ఉండే ప్యాకెట్లను కావాలంటూ చిన్నారులు మారాం చేయడం, పెద్దలు కొనివ్వడం పరిపాటిగా మారింది. వీటి అమ్మకాలు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ప్రజారోగ్యానికి పెనుముప్పు తప్పదని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

అసలును పోలిన నకిలీలు

ధనార్జనే లక్ష్యంగా అక్రమ తయారీదారులు నకిలీ చిరుతిళ్లను తయారుచేసి మార్కెట్‌లోకి వదులుతున్నారు. ఈ స్నాక్స్, చిరుతిళ్ల ప్యాకింగ్‌లపై చిరునామా, తయారీ తేదీ ఉండడం లేదు. కొన్ని సంస్థల పేర్లయితే అర్థమే కావడం లేదు. అసలు కంపెనీలను పోలి ఆకర్షణీయంగా ప్యాకింగ్ ఉండటం, మార్జిన్ కూడా ఎక్కువగా ఉండటంతో లాభాల కోసం షాపు యజమానులు వీటి అమ్మకాలనే ప్రోత్సహిస్తుంటారు.

జిల్లావ్యాప్తంగా నాసిరకం చిరుతిళ్ల వ్యాపారం నిత్యం లక్షల్లో సాగుతుందని నిపుణుల అంచనా.. గతంలో హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి దిగుమతయ్యే ఈ నకిలీ తినుబండారాలు ఇటీవల స్థానికంగానే తయారవుతున్నాయని పలువురు వ్యాపారులు చెబుతున్నారు.

మార్కెట్‌లో అమ్ముడుపోయే చిరు తినుబండారాల అమ్మకాలపై పర్యవేక్షణ చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజాసంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

పూర్తిగా నిషేధించాలి



ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లను చూసి పిల్లలు అవే కావాలని మారాం చేస్తుంటారు. అయినా సరే పిల్లలకు ప్రమాదకరమైన చిరుతిళ్లు, స్నాక్స్ ఇవ్వటం పూర్తిగా మానేయాలి. రెడీమేడ్ స్నాక్స్ వల్ల కలిగే ప్రమాదాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్నారులకు వివరించాలి. పోషక విలువలు కలిగిన ఆహారపదార్థాలను, పండ్లు ఇవ్వాలి.

– గంధం వసంతరావు, ఉపాధ్యాయుడు, వెల్ల

ప్రజలు దూరంగా ఉండాలి



మార్కెట్‌లో అమ్ముడుపోయే తినుబండారాలు, జంక్ ఫుడ్‌లకు ప్రజలు దూరంగా ఉండాలి. రుచి, నిల్వల కోసం వీటిలో ఉపయోగించే రసాయనాలు, రంగుల వల్ల కడుపునొప్పి, అజీర్తి వంటి తక్షణం సంభవించే వ్యాధులతో పాటు భవిష్యత్తులో ఏసీడీటీ, జీర్ణకోశ సమస్యలు, కిడ్నీ వ్యాధులు, పేగు సంబంధిత వ్యాధులొచ్చే అవకాశముంది.

– డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి, శ్రీరామ్ నర్సింగ్‌హోం, గొల్లపాలెం

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు ఆలయాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి ఘనంగా నిర్వహించారు. ద్రాక్షారామలోని ఓం శాంతి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బ్రహ్మకుమారీలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. వెలంపాలెం లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో ఉట్టి కొట్టే కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహించారు.

కృష్ణాలయాల్లో సందడి

కపిలేశ్వరపురం: గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. అంగరలోని శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివార్లను విశేషంగా అలంకరించారు. నేలటూరు, కపిలేశ్వరపురం, మాచర తదితర వైష్ణవాలయాల్లో కృష్ణాష్టమి పూజలు చేశారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో మెరిసారు. వారిని చూసి తల్లిదండ్రులు సంబర పడ్డారు. అంగరలోని శ్రీరామకృష్ణా స్కూల్‌లో ఉట్టికొట్టు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

కలువపువ్వు సెంటర్ వద్ద..

మండపేట: యాదవసేన నాయకుడు కోన సత్యనారాయణ, ఉషాకుమారి దంపతుల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక కలువపువ్వు సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు అలరించారు. కట్టమేను రామకృష్ణ, కట్టమేను వీర్రాజు, గంపల సత్యప్రసాద్, బిశ్వాస్, మహిళలు పాల్గొన్నారు.

గీతామందిరంలో..

కె.గంగవరం: మండల పరిధిలోని సత్యవాడలో కొలువైయున్న గీతామందిరంలో బుధవారం కృష్ణాష్టమి పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మందిరం వద్ద అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం గీతాపారాయణం, సాయంత్రం గొల్లలచే ఉత్సవం నిర్వహించారు.



ద్రాక్షారామ ఓం శాంతి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



శ్రీకృష్ణునికి పూజలు నిర్వహిస్తున్న సత్యనారాయణ తదితరులు

సంక్షేమ సారథికి తిరిగి పట్టం కట్టాలి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- చెల్లూరులో గడప గడపకూ..

రాయవరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సంక్షేమానికి చిరునామాగా మారిందని, సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు తిరిగి పట్టం కట్టాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. మండలంలోని చెల్లూరు శివారు యర్రమట్టిపురంలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పాలిక రాఘవ, ఉప సర్పంచ్ బుద్దాల రాంబాబు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సొసైటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు, ఎంపీటీసీ సభ్యురాలు పలివెల వెంకట ఆదిలక్ష్మి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చోడె వెంకటరమణ, సర్పంచుల సమాఖ్య మండల శాఖ అధ్యక్షుడు ఆరిఫ్ తదితరులతో కలిసి ఎమ్మెల్సీ త్రిమూర్తులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాల ద్వారా రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సాధికారితే లక్ష్యంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. సమాజంలో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. జగనన్న పాలనపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఏర్పడిందన్నారు. నవరత్నాలు పేరుతో 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలు పొందుతున్న లబ్ధితో ఉన్న కరపత్రాలను ఆయన ప్రజలకు అందజేశారు. త్రిమూర్తులకు అడుగడుగునా ప్రజలు పూలమాలలు, హారతులతో స్వాగతించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల సేవాదళ్ అధ్యక్షుడు వెలగల సత్యనారాయణరెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ తవిటికి రత్నకుమార్, సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, పార్టీ నేతలు పాలిక గోవిందు, పలివెల రామకృష్ణ, పిల్లి సుబ్రహ్మణ్యం, కోటి అంబేద్కర్, యనమదల దొరబాబు, యనమదల శ్రీను, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



చెల్లూరు శివారు యర్రమట్టిపురం వాసులకు బుక్ లెట్లు అందిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఆధునీకరించిన కమ్యూనిటీ హాలు పునఃప్రారంభం

మండపేట: విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించడం ద్వారా వారి సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మున్సిపల్ నిధులు రూ.20 లక్షల వ్యయంతో స్థానిక టౌన్ హాలు వద్ద ఆధునీకరించిన శ్రీకామాక్షి ఏకాంబరేశ్వరస్వామి కమ్యూనిటీ హాలును గురువారం ఎమ్మెల్సీ తోట పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం నేత వీరమల్లు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ సృష్టికి మూలం విశ్వబ్రాహ్మణులు అన్నారు. వారి అభ్యున్నతికి అవసరమైన తోడ్పాటు అందిస్తామన్నారు. తమ కల్యాణ మండపం ఆధునీకరణకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును, అలాగే మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరిని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, ముక్కా లోవలక్ష్మి, సంఘ నాయకులు త్రిపురారి మాణిక్యాలరావు, నరగిరి కృష్ణ, విన్నకోటి రాధాకృష్ణ, కోటిపల్లి కృష్ణమాచార్యులు, దార్ల జేజిబాబు, పట్నాల శ్రీనివాస్, వేముల శ్రీరామమూర్తి, దార్ల నాగు, అరిపిరాల నానాజీ, గోల్లి శ్రీను, లంగోజు మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ తోట, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కినను సత్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

ముత్యాలమ్మ ఆలయానికి భూమిపూజ

రాయవరం: మండలంలోని నదురుబాద గ్రామంలో ముత్యాలమ్మ వారి ఆలయ నిర్మాణ పనులకు గురువారం వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ భూమిపూజ చేశారు. సుమారు 150 ఏళ్ల క్రితం నిర్మించిన అమ్మవారి ఆలయం జీర్ణావస్థకు చేరుకుంది. దాంతో నూతన ఆలయ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు నిర్ణయించారు. ఇదే విషయాన్ని స్థానిక నేతలు తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకుని వెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ త్రిమూర్తులు రూ.30 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో చేపట్టే ఆలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ తనయుడు, యువనేత పృథ్వీరాజ్ భూమి పూజ చేశారు. అలాగే గ్రామంలో ఎమ్మెల్సీ నిధులు రూ.2 లక్షలతో నిర్మించిన జల్లు స్నానఘట్టాన్ని పృథ్వీరాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు, సొసైటీ మాజీ చైర్మన్ నల్లమిల్లి వెంకటరెడ్డి, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నదురుబాదలో ఆలయానికి భూమి పూజ చేస్తున్న వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్



భవిత కేంద్రంలో మోటార్ చోరీ

మండపేట: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో నీటి అవసరాలకు వినియోగించే మోటార్ చోరీకి గురైంది. కృష్ణాష్టమి సందర్భంగా బుధవారం సెలవు కావడంతో ముందు రోజే ఐఈఆర్‌పీలు భవిత సెంటర్‌కు తాళాలు వేసి వెళ్లారు. గురువారం ఉదయం వచ్చి చూసేసరికి మోటార్ రూం తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా మోటార్ చోరీకి గురైనట్టు సిబ్బంది గుర్తించారు. ఐఈఆర్‌పీ ఉదయశంకర్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోటార్ విలువ సుమారు రూ.ఐదు వేలు ఉంటుందన్నారు. గతంలో ఒక మోటార్ చోరీకి గురవగా కేంద్రానికి వచ్చే విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో ఈ మోటార్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పుడు ఇది కూడా చోరీకి గురైనట్టు ఆయన వివరించారు.

పశు వ్యర్థాలతో ఆరోగ్య సమస్యలు



అంగరలో పశువుల మకాంను పరిశీలిస్తున్న డాక్టర్ సుదర్శన్‌బాబు

కపిలేశ్వరపురం: పశు వ్యర్థాలతో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్య ఆరోగ్య శాఖ రామచంద్రపురం డివిజినల్ అధికారి ఆర్.సుదర్శన్ బాబు హెచ్చరించారు. అంగరలో జనావాసాల్లో పశువుల మకాంను నిర్వహిస్తున్నారని, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయంటూ స్పందన కార్యక్రమంలో గ్రామస్తుడు నుంచి ఫిర్యాదు అందింది. ఘటనా స్థలాన్ని పరిశీలించాలంటూ వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీ అధికారులను జిల్లా అధికారులు ఆదేశించారు. ఈ నేపథ్యంలో డివిజినల్ అధికారి సుదర్శన్‌బాబు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి, సిబ్బందితో కలిసి పశువుల మకాంను సందర్శించారు. పశువుల వ్యర్థాలు జనావాసాల్లో ఉండడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయంటూ ఆరోగ్య సమస్యల తీరుతెన్నులను వివరించారు. ఆయన వెంట ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లిఖార్జునుడు, వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు అఖిలపక్ష భేటీ డిమాండ్

మండపేట: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర నాయకుడు దూలి జయరాజు ఆధ్వర్యంలో గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ హాలులో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, బీజేపీ నేత గొడవర్తి రామచంద్రరావు, ఎంఎస్పీ నేత వల్లూరి సత్తిబాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ మేరకు ఈనెల 18 నుంచి 22 వరకు జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని కోరారు. ఈ విషయమై కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 11వ తేదీ నుంచి ఎమ్మార్పీఎస్ చేస్తున్న కార్యాచరణకు అఖిల పక్షాలు మద్దతు తెలిపాలని విజ్ఞప్తి చేశారు. సమావేశానికి హాజరైన వివిధ రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు ఎస్సీ వర్గీకరణకు తమ మద్దతు తెలియజేశారు. వివిధ సంఘాల నాయకులు మల్లువలస గణపతి, కాశిన కాశీ విశ్వనాథం, బొత్స నరసింహమూర్తి, వాద ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విరిగిపడ్డ లారీ చక్రాలు

ఆలమూరు: ఆలమూరు–మండపేట రోడ్డులో ఇసుక లారీ చక్రాలు విరిగిపడిన ఘటనలో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం జొన్నాడ నుంచి మండపేట వైపు ఇసుక లోడుతో వెళుతున్న ఆరు యూనిట్ల లారీ బుధవారం రాత్రి 11 గంటల సమయంలో దేవి థియేటర్ సమీపంలోకి వచ్చేసరికి గోతిలో పడి వెనుక చక్రాలు రెండూ ఊడిపోయాయి. దీనివల్ల ట్రాఫిక్‌కు కొంత సేపు అంతరాయం కలగగా పోలీసులు వచ్చి క్రమబద్ధీకరించారు. అయితే రోడ్డు మధ్యలో ఆగిపోయిన లారీ పక్క నుంచి మరో లారీ వెళుతూ బురదలో దిగిపోయింది. దీంతో ఇరువైపులా వచ్చే వాహనాలు రాకపోకలు సాగించే అవకాశం లేక ప్రయాణికులు, వాహనదారులు గంటల తరబడి ఇబ్బందులు పడ్డారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

కాజులూరు: పారిశుధ్య నిర్వహణపై సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ ఐ.రత్నరాజు అన్నారు. గురువారం మండలంలోని చేదువాడ, గొల్లపాలెం, కాజులూరు తదితర గ్రామాల్లో పర్యటించి జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకంపై కార్యదర్శులతో చర్చించారు. గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజలు చెత్తను పారిశుధ్య కార్మికులు తీసుకెళ్లే రిక్షాల్లో వేసేలా కార్యదర్శులు కృషి చేయాలన్నారు. తడి, పొడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించటం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చెల్లుబోయిన వేణుగోపాలరావు, షేక్ జహంగీర్, సూరిబాబు, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

సబ్ డివిజినల్ అధికారి సుదర్శన్



అంగర పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న సుదర్శన్, రత్నకుమారి

కపిలేశ్వరపురం: సీజనల్ వ్యాధులపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖ రామచంద్రపురం సబ్ డివిజినల్ అధికారి ఆర్.సుదర్శన్ ఆ శాఖ పీహెచ్‌సీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని ఆదేశించారు. అంగరలోని పీహెచ్‌సీలో గురువారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి పి.రత్నకుమారి ఆసుపత్రి పనితీరుపై మాట్లాడారు. గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ప్రచార, సర్వే కార్యక్రమాలను చొరవతో నిర్వహిస్తున్న సిబ్బందిని డాక్టర్ సుదర్శన్ అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఈ బి.రామారావు, ఎంపీహెచ్‌ఎస్ పి.సురేష్ పాల్గొన్నారు.

మాది రైతుల వెన్నంటి నిలిచే ప్రభుత్వం

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సామాన్య రైతుల వెన్నంటి నిలుస్తూ సంక్షేమ పథకాలు ద్వారా వ్యవసాయాన్ని పండగ చేస్తున్న ప్రభుత్వమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని నల్లూరులో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. భవన నిర్మాణానికి స్థలాన్ని దానం చేసిన గ్రామానికి చెందిన వైద్యుడు వేగుళ్ళ గంగా ప్రభాకర్ చౌదరిని ప్రశంసించారు. ఆయన సేవాగుణం గ్రామస్తులకు దీర్ఘకాలం పాటు విశేష సేవలనందిస్తుందన్నారు. భవన నిర్మాణానికి చొరవ చూపిన గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులను అభినందించారు. రైతులకు ఎలాంటి సమస్యల తలెత్తినా పరిష్కరించేందుకు ముందుంటానని ఎమ్మెల్సీ తోట భరోసా ఇచ్చారు. పంచాయతీ సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణబాబు, ఏఎంసీ డైరెక్టర్ కురుపూడి శివ, నాయకులు కురుపూడి రాంబాబు, మార్ని పూసబ్బు, సవిలే శరత్‌బాబు, జయంతి బాబు, నక్కా సింహాచలం, మండల సేవాదళ్ కన్వీనర్ పాలింగి కిశోర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సత్కరించిన దృశ్యం

రాయవరం: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఉపాధ్యాయులను పాఠశాల టీచర్లు, విద్యార్థులు గురువారం సత్కరించారు. వెంటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిషు ఉపాధ్యాయుడు గొడవర్తి గంగాధర వీర ప్రభాకర రావు, హిందీ ఉపాధ్యాయిని ఆదిరాజు ఉషలు ఈ నెల 5న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. ఈ క్రమంలో గురువారం ఆ పాఠశాలలో హెచ్‌ఎం డి.సత్తిరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వారిని దుశ్శాలువా, పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ, ఉపాధ్యాయులు పి.శేషుబాబు, కందుల శ్రీనివాసరావు, పట్నాల శ్రీనివాస్, రాయుడు శ్రీరంగసాయిబాబా, పీఎస్ తిరుమలరావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కపిలేశ్వరపురం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, నిర్దిష్ట వయస్సు పూర్తయ్యే వరకూ చిన్నారులు విద్యాలయంలో విద్య అభ్యసించాలని వల్లూరు సచివాలయ మహిళా పోలీస్ గెద్దం ప్రమీల అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, బడి బయట పరిస్థితులు, కుటుంబ పరిస్థితులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. రహదారి నిబంధనలపు అవగాహనతో మెలగడం ద్వారా ప్రమాదాలను నివారించగలుగుతామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీఎస్‌వీవీఎస్‌ఎన్‌మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.